క్లుప్తంగా

రేపు బుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన



బూచినెల్లిలో నిర్మించిన బుద్ధ విహార్

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి గ్రామంలో నిర్మించిన బుద్ధ విహారంలో ఈ నెల 12న గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొంత కాలం నుంచి బూచినెల్లిలో సారనాథ్ బుద్ధవిహార్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనులు పూర్తికావడంతో బుద్ధ పౌర్ణమి రోజు 3.5అడుగుల వెండి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయి. శనివారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఆయన క్యాంపు కార్యాలయంలో 16 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4,87,000 వేల చెక్కులను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వపాలిని మందిరంలో చండీయాగం



యాగం చేస్తున్న కిషన్‌సింగ్ తదితరులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బల్కంచెల్క తండాలోని విశ్వపాలిని జ్వాలాముఖి భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో శనివారం వింశతి(20వ) చండీ యాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కిషన్‌సింగ్, లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. హారతి, తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైల్‌సింగ్, రూప్‌సింగ్, కిషన్, మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృత్యువాత పడిన గొర్రెలు

హత్నూర(సంగారెడ్డి): కుక్కల దాడిలో గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన హత్నూర మండలం కాసాల గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఆరెగళ్ల కిష్టయ్య, పాముల సురేష్‌లకు చెందిన గొర్రెల మందపై శుక్రవారం రాత్రి కుక్కలు దాడి చేయగా 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. శనివారం ఉదయం చూసేసరికి గొర్రెలు మృత్యువాత పడటంతో గొర్రెల కాపరులు బోరున విలపించారు. అయితే గొర్రెలను పరిశీలించగా కుక్కలు దాడి చేసిన గాయాలు కనిపిస్తున్నాయని చెప్పారు. గొర్రెల విలువ సుమారు రెండున్నర లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

సీఐటీయూ బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు , నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): ఈ నెల 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ కార్యవర్గ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీలోని పారిశ్రామికవాడలో కార్మికులతో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెరువు

నిర్లక్ష్యానికి గురవుతున్న ఔరంగ్‌నగర్, గౌసాబాద్ తటాకం

- రూ.70 లక్షలు ఖర్చు చేసినా ఉపయోగపడని వైనం
- అసంపూర్తిగా పునరుద్ధరణ పనులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



అసంపూర్తిగా చేసిన చెరువు పనులు

జహీరాబాద్ టౌన్: రైతులకు ఆసరాగా ఉండే చెరువు అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా దర్శనమిస్తోంది. లక్షలు ఖర్చు చేసినా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మధ్యలోనే నిలిచిపోయిన పనుల గురించి ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. మొగుడంపల్లి మండలంలోని ఔరంగ్‌నగర్, గౌసాబాద్ గ్రామాల మధ్యలో ఉన్న నిజాం కాలం నాటి చెరువు నిర్లక్ష్యానికి గురవుతోంది. పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసినా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టక అలంకార ప్రాయంగా ఉంది.

మొగుడంపల్లి మండలంలోని ఔరంగనగర్, గౌసాబాద్ గ్రామాల పరిధిలో నిజాంకాలం నాటి పురాతనమైన చెరువు ఉంది. చెరువు కింద 186 ఎకరాల ఆయకట్టు ఉంది. పూడిక పేరుకుపోయి చెట్ల పొదలతో చెరువు నిండిపోయింది. కట్ట కూడా పూర్తిగా దెబ్బతింది. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడితే మేలు జరుగుతుందని రెండు గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. 2008లో ఎమ్మెల్యేగా ఉన్న గీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. చెరువు మరమ్మతుల కోసం ఆమె రూ.73.70 లక్షల నిధులను మంజూరు చేయించారు. 2010లో చెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. చెరువు కట్ట పెంచడంతో



గీతారెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

పాటు అలుగు, కాలువ పనులను ప్రారంభించారు. కానీ పునరుద్ధరణ పనులు అసంపూర్తిగా వదిలేశా రు. మొక్కుబడిగా పనులు చేపట్టి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వం మారడంతో చెరువు గురించి పట్టించుకునే వారు కరువయ్యా రు. ఇప్పటికైనా ఇరిగేషన్



ముళ్ల పొదలతో దర్శనమిస్తున్న చెరువు

అధికారులు స్పందించి ఔరంగ్‌నగర్ చెరువుకు మిగులు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. చెరువు గురించి ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అక్కడ చెరువు ఉన్న విషయం తమకు తెలియదని చెప్పడం గమనార్హం.

పిలుపొస్తే యుద్ధం చేయడానికి వెళ్తా..

మాజీ జవాన్ దేవరాజ్



హబ్సి దేవరాజ్

జహీరాబాద్ టౌన్ : దేశ రక్షణ కోసం మేము సైతం అంటూ కొందరు ఆర్మీలో చేరుతారు. రాష్ట్ర సరిహద్దులో సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామానికి చెందిన హబ్సి దేవరాజ్ ఆర్మీలో చేరి 25 సంవత్సరాలు పని చేశారు. జమ్ముకశ్మీర్, రాజస్థాన్, గోవా, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో కూడా ఆయన పాల్గొన్నారు. ఐదేళ్ల క్రితం పదవి విరమణ చేశారు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం ఉండగా పిలుపు వస్తే విధుల్లో చేరతానని ఆయన తెలిపారు. తన సేవలు అవసరమని, విధుల్లో చేరాలని ఆర్మీ అధికారుల నుంచి ఆదేశాలు వస్తే యుద్ధ భూమికి వెళ్తానని దేవరాజ్ పేర్కొన్నారు.

పరిశ్రమల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సీఐ స్వామి గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ స్వామి గౌడ్

పటాన్‌చెరు టౌన్: పాశమైలారం పారిశ్రామికవాడలోని ప్రతి పరిశ్రమ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ అన్నారు. శనివారం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఐలా సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... పరిశ్రమలు సీసీ కెమెరాలను రోడ్డుపై వెళ్లే వాహనాలను కవర్ చేసే విధంగా ఉండాలన్నారు. పారిశ్రామికవాడలో ఏవైనా ఘటనలు జరిగినా సీసీ కెమెరాల ఆధారంగా వారిని పట్టుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కక్కర్ వాడలో ఈ నెల 14 న జరిగే శ్రీరామలింగేశ్వర స్వామి, నంది విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర పూజా కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. శనివారం బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో పీఠాధిపతి 1008 మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వీర్ శెట్టి, నవీన్ రెడ్డి, నరసింహులు, వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి, కమిటీ సభ్యులు

మత్తు పదార్థాలపై గిరిజనులకు అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నర్సాపూర్: మత్తు పదార్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించినట్లు స్థానిక ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ గోపాల్ చెప్పారు. శనివారం ఉదయం నర్సాపూర్ సంగారెడ్డి మార్గంలో పలు వాహనాలు తనిఖీ చేశామని తెలిపారు. అనంతరం మండలంలోని సూర్యతండా, హరియా తండా, మాడాపూర్ తండాలకు చెందిన గిరిజనులకు పలు అంశాలపై అవగాహన కల్పించామని చెప్పారు. నాటుసారా తయారు చేయడం, గంజాయి, డ్రగ్స్, కల్లులో కలిపే మత్తు పదార్థాలు కల్గి ఉండటం అమ్మడం నేరమని వారికి అవగాహన కల్పించామని, ఎవరైనా వాటిని అమ్మినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి సమాచారం రహస్యంగా ఉంచుతామని వారికి వివరించినట్లు గోపాల్ చెప్పారు. తనతో పాటు తమ సిబ్బంది పాల్గొన్నారని ఆయన వివరించారు.

పద్మశాలీల బండ్ల ఊరేగింపు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో కొలువైన శ్రీ రంగనాయక స్వామి పంచాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా కొనసాగుతూ వస్తున్నాయి. శనివారం తెల్లవారుజామున స్వామివారిని అశ్వ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం గ్రామ పద్మశాలీల సంఘం ఆధ్వర్యంలో ఆనవాయితీ ప్రకారం స్వామివారికి బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఉత్సాహంగా కొనసాగింది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

యువతి పెళ్లికి ఆర్థిక సాయం

నారాయణఖేడ్: మండలంలోని పైడిపల్లికి చెందిన ఓ పేదింటి యువతి పెళ్లికి కుటుంబీకులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఖేడ్ ముస్లీం యాక్షన్ కమిటీ ఆర్థిక సహాయం అందించింది. కమిటీ బాధ్యులు తాహెర్ అలీ, యూనూస్ తదితరులు శనివారం నగదుతో పాటు భోజనాల తయారీకి అవసరమైన కిరాణా, ఇతర సామగ్రిని వారికి అందజేశారు.

నేటి నుంచి సప్తాహ మహోత్సవం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం బాణాపూర్ రుక్మిణి పాండురంగ దేవాలయంలో ఈనెల 11 నుంచి 22వ తేదీ వరకు అఖండ హరి నామ సప్తాహ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వారం రోజుల పాటు కీర్తనకారులు కీర్తనలు నిర్వహిస్తారని వివరించారు.

ఘనంగా హేమారెడ్డి మల్లమ్మ జయంతి

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రం కంగిలో హేమారెడ్డి మల్లమ్మ జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు సిర్మా రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హేమారెడ్డి మల్లమ్మ చిత్రపటానికి పూల మాల వేసి పూజించారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, భూంరెడ్డి, మల్లారెడ్డి, పాండురంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, మారుతిరెడ్డి పాల్గొన్నారు.

మునిపల్లి మండలంలో వర్షం

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షం పడింది. శనివారం మండలంలోని పెద్దలోడి, హైద్లాపూర్, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో వర్షం పడింది. ఈదురు గాలులు వీచాయి. వర్షం పడటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

94వ రోజుకు చేరిన నిరసనలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలు 94వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, ప్యారానగర్ ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డంపింగ్‌యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ప్రతిపాదనలు

రాయికోడ్(అందోల్): వానాకాలం పంటల సాగు కోసం అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు మండల వ్యవసాయ అధికారి సారిక ఒక ప్రకటనలో తెలిపారు. వెయ్యి టన్నుల డీఏపీ, 1,500 టన్నుల కాంప్లెక్స్, 4 వేల టన్నుల యూరియా, 800 టన్నుల ఎంఓపీ ఎరువులు రైతులకు అవసరమవుతాయన్నారు. విడతల వారీగా ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నామని అధికారులు వివరించారు.

రసాయన పరిశ్రమలో చోరీ

తూప్రాన్: పట్టణ పరిధిలోని రావెల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో చోరీ జరిగింది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. సంక్షేన్ కెమికల్ పరిశ్రమలో ఈనెల 7న విలువైన సామగ్రితో పాటు రూ. లక్ష విలువైన వ్యవసాయ పనిముట్లను ఆటోలో అపహరించుకెళ్లినట్లు సెక్యూరిటీ గార్డు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీడ కల్పించారు.. నీళ్లు ఏర్పాటు చేశారు

సాక్షి ఎఫెక్ట్..

హత్నూర(సంగారెడ్డి): సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన నిలువ నీడ లేదు... నీళ్లు లేవు కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. హత్నూర మండలంలోని ఉపాధి హామీ కూలీలకు నీడ కల్పించారు. తాగునీరు ఏర్పాటు చేయడంతో కూలీలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు నీడ ఏర్పాటు చేయడంతోపాటు తాగు నీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందిస్తున్నట్లు ఏపీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు.



ఉపాధి కూలీలకు నీడ ఏర్పాటు చేసి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

జిల్లా కెమిస్ట్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక



కెమిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సంగారెడ్డి : జిల్లా మెడికల్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం కెమిస్ట్ భవన్‌లో జరిగాయి. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా టీటీసీడీఏ కోశాధికారి తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ రాజు హాజరై జనరల్ బాడీ మీటింగ్, ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా అనుముల సంతోష్ కుమార్, కోశాధికారిగా రమేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వెంకటేశ్వర్లు, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సంగమేశ్వర్, జిల్లా కోశాధికారి జి.శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా కోశాధికారి డి.వినోద్, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ వి.నాగసాయి, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు దశరథ, పట్టణ ప్రధాన కార్యదర్శి శశికాంత్ చందన్, కోశాధికారి కే.కృష్ణ పాల్గొన్నారు.

వారాంతపు సంత నిలిపివేత

- జనావాసాలు లేని ప్రాంతంలో తాత్కాలికంగా నిర్వహణ
- అనువైన ప్రదేశం కేటాయించాలని వ్యాపారులు, రైతుల విన్నపం

జహీరాబాద్: పట్టణంలోని సాయినగర్ కాలనీలో శనివారం వారాంతపు సంతను కాలనీ ప్రజలు నిలిపివేయించారు. కాలనీలో సంతను నిర్వహించడం వల్ల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అంతే కాకుండా దొంగతనాలు సైతం జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం మున్సిపల్ అధికారులు, పోలీసులకు తమ ఇబ్బందుల గురించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. గతంలో జనావాసాలు లేకపోవడంతో జహీరాబాద్ పట్టణంలో మూడో వారాంతపు సంతను కాలనీలో నిర్వహించారని, ఇప్పుడు ఇండ్ల నిర్మాణాలు, అపార్టుమెంట్ల నిర్మాణాలు జరగడంతో ఇండ్లల్లోకి వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులకు వివరించారు. కాలనీలోని ప్రధాన రహదారిపై సంతను నిర్వహించడం వల్ల సుమారు కిలో మీటరు మేర రహదారిపై ట్రాఫిక్ జాం అవుతుందని ఏకరువు పెట్టారు. మూడు వారాల పాటు సంత నిర్వహణకు సమయం ఇచ్చామని, ఈసారి సంతను నిర్వహించవద్దని అధికారికంగా ప్రచారం చేయించామని కాలనీ వాసులు తెలిపారు. శనివారం జరగాల్సిన సంత నిర్వహించకుండా కాలనీ వాసులు పర్యవేక్షించారు. రైతులు, వ్యాపారులు నివాసాలు లేని ప్రాంతంలో సంతను తాత్కాలికంగా నిర్వహించారు. సాయినగర్ కాలనీలో సంత నిర్వహించడం వల్ల తమకు లాభాలు వచ్చేవని వారు పేర్కొన్నారు. సంత నిర్వహణకు అనువుగా ఉన్న స్థలాన్ని కేటాయించాలని రైతులు, వ్యాపారులు అధికారులను కోరారు.



కాలనీ ప్రధాన రహదారిపై సంత నిర్వహించకుండా మకాం వేసిన సాయినగర్ కాలనీ వాసులు

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి

హవేళీఘణాపూర్(మెదక్): విద్యార్థులు చదువులతోనే కాకుడా క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపి ఉన్నత స్థాయిలో రాణించాలని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌లో క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు మొబైల్ ఫోన్‌లలో చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. క్రీడాకారులతో కరచాలనం చేసిన సీఐ టోర్నీని ప్రారంభించారు. ఈ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులకు మల్లేశం సహకారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు, ఘట్టయ్య, అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గట్టాగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ కొమ్ము పవన్, మాజీ వార్డు సభ్యుడు గట్టయ్య, నిర్వాహకులు మహమ్మద్ ఖుర్షీద్, బక్కన్నగారి శ్రీహరి, రవీందర్, ప్రభాకర్, దుర్గారాములు తదితరులు ఉన్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

మూగజీవాల దాహం.. దాహం

కౌడిపల్లి(నర్సాపూర్): అడవిలో మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లలో నీరులేక నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాల దాహార్తి తీరకుండా పోతోంది. మండల కేంద్రమైన కౌడిపల్లి అడవిలో కూకుట్లపల్లి వెళ్లే దారిలోని బండగుట్ట అడవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ అధికారులు గతంలో సాసర్‌పిట్లు ఏర్పాటు చేశారు. అయితే అందులో నీరు మాత్రం పోయలేదు. అసలే ఎండలు మండుతుండటంతో మూగజీవాలకు తాగు నీటి సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.



నీరులేక, ధ్వంసమైన సాసర్‌పిట్లు

ఫరీద్‌పూర్ చెరువుకు జలకళ



ఫరీద్‌పూర్ చెరువు

హవేళీఘణాపూర్(మెదక్): మండుతున్న ఎండలతో చుక్కనీరు లేక వెలవెలబోతుంటే మండల పరిధిలోని ఫరీద్‌పూర్ చెరువు మాత్రం నిండుకుండలా మత్తడి వరకు నీరు నిలిచి ఉంది. కొద్దినీరొస్తే అలుగు పారుతుందన్నట్టుగా ఉంది. కొంత కాలంగా ఎంఎస్ కెనాల్ నుంచి నీటిని వదలగా రైతులు చెరువును నింపారు. దీంతో చుట్టుపక్కల ఉన్న రైతుల బోర్లకు భూగర్భ జలాలు పెరిగి పంటలు సమృద్ధిగా పండించుకున్నారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ఆలయ పూజారి గోపాలకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా పలకీసేవ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.